www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -295 శనివారం 31 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## 'ఐగాట్ కర్మయోగి' లో ఏపీ రికార్డు

కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత

ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన సీఎం చంద్రబాబు

నైపుణ్యం గల పరిపాలన కోసమే ఈ కార్యక్రమమని వెల్లడి

ఈ ఘనతలో ఏపీఎస్‌డీపీఎస్ పాత్రను అభినందించిన సీఎం




2లో.

## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్

సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు

శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్



2లో.

## శాంతి దిశగా అడుగులు


: జెలెన్‌స్కీకి రష్యా ఆహ్వానం..

రంగంలోకి ట్రంప్

చర్చల కోసం మాస్కో రావాల్సిందిగా జెలెన్‌స్కీకి క్రెమ్లిన్ ఆహ్వానం

యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ముమ్మర యత్నాలు

ఉక్రెయిన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపాలని పుతిన్‌కు ట్రంప్ విజ్ఞప్తి



# తెగని పంచాయితీ

ఎజెండాలో పోలవరం నల్లమల సాగర్ మినహా 12 అంశాలు చేర్చాలి

కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ ప్రతిపాదన

ఎజెండా లేకుండానే హాజరైన ఏపీ

వారంలో ప్రతిపాదనలు ఇవ్వాలని ఏపీకి సీడబ్ల్యూసీ చైర్మెన్ సూచన

అంశాలు ఖరారయ్యాకే తదుపరి భేటీ అని తేల్చిన కమిటీ



**హైదరాబాద్‌ప్రజావినికిడి,**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) చైర్మెన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలో రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో ఎలాంటి ముందడుగు పడలేదు. ఎజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టును ఎజెండాలో చేర్చొద్దని కోరింది. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్-2(కేడబ్ల్యూ డీటీ) తీర్పు వచ్చే వరకు కృష్ణా నీటిలో 50 శాతం నిటిని వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. మిగతా 2లో...

# 11 న అసెంబ్లీ .. 14న బడ్జెట్!




- ఈ నెల 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 14న బడ్జెట్!
- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు

2లో.



2లో.

## పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు: పవన్ కల్యాణ్

గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నాశనం చేసింది

వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణ

# కొలువుదీరిన సమ్మక్క..

జనసంద్రంగా మారిన వనం

వైభవంగా సమ్మక్క గద్దె చేరే ఘట్టం.. పోటెత్తిన భక్తజనం

వివిధ రాష్ట్రాల నుంచి పోటెత్తిన లక్షలాది భక్తులు

వనదేవతలకు మొక్కులు చెల్లించిన బ్రిటిష్ అధికారి

పటిష్ట ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా సాగుతున్న జాతర

మేడారం,**జనవరి 30ప్రజావినికిడి,**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర మూడో రోజైన శుక్రవారం పతాకస్థాయికి చేరింది. వనదేవత సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరడంతో మేడారం ప్రాంగణం భక్తులతో జనసంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మేడారం కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలు, జంపన్న వాగు భక్తులతో నిండిపోయాయి. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులుమిగతా 2లో...





## ఖాకీల గర్జనతో దిగొచ్చిన 'పాడి'

'నోరు జారానంటూ' సీపీకి కౌశిక్‌రెడ్డి క్షమాపణలు

వీణవంక జాతర సాక్షిగా చెలరేగిన ఆధిపత్య పోరు

కరీంనగర్ సీపీపై అనుచిత వ్యాఖ్యలు

ఆగ్రహించిన ఐపీఎస్ అధికారుల సంఘం

సోషల్ మీడియా వేదికగా హుజురాబాద్ ఎమ్మెల్యే వివరణ

2లో.

## ఫామ్‌హౌజ్ విచారణ కుదరదు

కెసిఆర్‌కు సిట్ షాక్

మరోమారు నోటీసులు జారీ

ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ

నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి

హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,**


ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. మిగతా 2లో...



## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

కామన్ స్కూల్ ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుంది,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు

దేశంలో భూసంస్కరణలకు ఆద్యుడు బూర్గుల రామకృష్ణారావు




3లో.

## తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి

వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సిఎస్ సమీక్ష



హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,**

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, మిగతా 2లో...

# రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

## హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్

హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,**

రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు −24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.

# శాంతి దిశగా అడుగులు

## చర్చల కోసం మాస్కో రావాల్సిందిగా జెలెన్‌స్కీకి క్రెమ్లిన్ ఆహ్వానం

హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,**

దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అంతర్జాతీయ వేదికలపై దౌత్య ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. రష్యా ప్రభుత్వం మరోసారి ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీని శాంతి చర్చల కోసం మాస్కో రావాల్సిందిగా ఆహ్వానించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

అయితే, జెలెన్‌స్కీ గతంలోనే ఇలాంటి ఆహ్వానాన్ని తిరస్కరించారు. ప్రతిరోజూ క్షిపణి దాడులు చేస్తున్న దేశ రాజధానికి తాను వెళ్లలేనని, చర్చలు జరగాలంటే పుతిన్ 'కీవ్'కు రావాలని డిమాండ్ చేశారు. తాజా ఆహ్వానంపై ఉక్రెయిన్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా చేపట్టిన దౌత్యవేత్తల చర్చలు అబుదాబిలో సాగుతున్నాయి. గత వారాంతంలో జరిగిన మొదటి రౌండ్ చర్చలు 'నిర్మాణాత్మకంగా' సాగాయని, ఫిబ్రవరి 1వ తేదీన రెండో రౌండ్ చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. "చాలా మంచి పరిణామాలు జరుగుతున్నాయి" అని ఈ చర్చల పురోగతిపై ట్రంప్ స్వయంగా ట్వీట్ చేయడం విశేషం.ఉక్రెయిన్‌లో ప్రస్తుతం మైనస్ డిగ్రీల చలి తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో లక్షలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గిపోవడంతో, మానవతా దృక్పథంతో విద్యుత్ గ్రిడ్లపై దాడులు ఆపాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తికి రష్యా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. దీనిపై రష్యా నేరుగా స్పందించనప్పటికీ, వారం రోజుల పాటు 'హ్యూమానిటేరియన్ పాజ్' (మానవతా విరామం) ఇచ్చే అవకాశం ఉందని వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి.శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా, కొన్ని అంశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అలాగే, రష్యా ఆక్రమించిన సుమారు 20 శాతం ఉక్రెయిన్ భూభాగాల (ముఖ్యంగా డోనెట్స్క్ రీజియన్) భవిష్యత్తుపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. యుద్ధం తర్వాత ఉక్రెయిన్‌కు అమెరికా ఇచ్చే భద్రతా హామీల పట్ల రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జపోరిజియా అణు ప్లాంట్ నియంత్రణ ఎవరి దగ్గర ఉండాలనేది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది.

# 'ఐగాట్ కర్మయోగి' లో ఏపీ రికార్డు

## కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత

**జనవరి 30ప్రజావినికిడి,**

ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐగాట్ కర్మయోగి' పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది అద్భుతమైన వార్త అని, ప్రభుత్వ ఉద్యోగులు నిరంతర అభ్యాసంపై చూపుతున్న నిబద్ధతకు ఈ ఘనత నిదర్శనమని ఆయన అన్నారు. నైపుణ్యం, చురుకుదనం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పరిపాలనను నిర్మించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.ఐగాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌పై కోటికి పైగా కోర్సు ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సుల పూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఉద్యోగులు మొత్తం 4,290 కోర్సులలో ఈ శిక్షణ పూర్తిచేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.కేంద్ర ప్రభుత్వం సైతం ఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ ఘనతను ప్రశంసించింది. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పౌర సేవలపై సానుకూల ప్రభావం చూపడంలో రాష్ట్రం ముందుందని కొనియాడింది. ఏపీ సాధించిన ఈ విజయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిలువుటద్దమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 11 న అసెంబ్లీ .. 14న బడ్జెట్!

**జనవరి 30ప్రజావినికిడి,**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీని సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు.ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

# ఫామ్‌హౌజ్ విచారణ కుదరదు

(మొదటి పేజి తరువాయి)

కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# తెగని పంచాయితీ

(మొదటి పేజి తరువాయి)

రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాలకు సంబంధించి అనేక సమస్యలు, వివాదాలు కొనసాగుతున్నాయనీ, వాటన్నింటిని ఎజెండాలో లిఖిత పూర్వకంగా కమిటీలో ప్రస్తావించామని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మీడియాకు తెలిపారు. అయితే ఏపీ అధికారులు ఎలాంటి ఎజెండా లేకుండా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ చేసిన ప్రతిపాదనలకు సైతం వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీడబ్ల్యూ సీ చైర్మెన్ వారంలోగా ఎజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఏపీకి సూచించారు. అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని నిర్ణయిస్తామని ఆయన ఇరు రాష్ట్రాలకు తెలియజేశారు.

పోలవరం-నల్లమల సాగర్ అంశాన్ని ఎజెండాలో పెట్టొద్దు : తెలంగాణ తెలంగాణ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మాట్లాడుతూ ఏపీ నిర్మించతలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ అంశాన్ని కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ ఎజెండాలో చేర్చొద్దని స్పష్టం చేశామన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి చర్చించే ఎజెండాను నిర్ణయించేందుకే మొదటి సమావేశం జరిగిందన్నారు. కేవలం గోదావరి, కృష్ణా నీటి వివాదాలకు సంబంధించి అంతర్రాష్ట్ర అంశాలపై ఈ సమావేశం జరిగిందని తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ తరపున తొలి సమావేశంలో ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వలేదని, వారంలో సమర్పిస్తామని ఏపీ అధికారులు చెప్పినట్టు రాహుల్ బొజ్జ తెలిపారు.

అయితే ఏపీ ప్రతిపాదనలు ఇచ్చాకే సీడబ్ల్యూసీ అంశాల వారీగా ఎజెండా నిర్ణయిస్తుందని, వాటి ఆధారంగా కమిటీ రెండో సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నది జలాలకు సంబంధించి మొత్తం కేటాయింపులపై ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయని రాహుల్ బొజ్జా తెలిపారు. ఒకవేళ కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీలో ఈ సమస్యలను పరిష్కరించుకోగలిగితే, సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలను వెనక్కి తీసుకోవచ్చన్నారు. ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ అధికారులు, కష్ణానది యాజమాన్య మండలి (కేఆర్ఎంబీ), గోదావరి నది యాజమాన్య మండలి (జీఆర్ఎంబీ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మెన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్, ఏపీ జలవనరుల శాఖ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు హాజరయ్యారు.

# ఖాకీల గర్జనతో దిగొచ్చిన 'పాడి'

కరీంనగర్

సంచలన ప్రకటనలతో వార్తల్లో నిలిచే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఈసారి ఏకంగా పోలీస్ బాసులనే టార్గెట్ చేసి చిక్కుల్లో పడ్డారు. వీణవంక జాతర నిర్వహణ విషయంలో స్థానిక ఆధిపత్య పోరులో భాగంగా మొదలైన గొడవ కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై వ్యక్తిగత, మతపరమైన దూషణల వరకు వెళ్లింది. దీంతో ఆ ఎమ్మెల్యే తీవ్ర విమర్శలపాలు కాగా.. మరోవైపు ఐపీఎస్ అధికారుల సంఘం గట్టిగా స్పందించడం, కేసులు నమోదు కావడంతో ఎట్టకేలకు ఆయన సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పారు. 'అది ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కావు' అంటూ కౌశిక్‌రెడ్డి వివరణ ఇచ్చుకున్నారు. జాతరలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు కౌశిక్‌రెడ్డి రాకను అడ్డుకోవడంతో వివాదం ముదిరింది. పోలీసుల తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే, హుజూరాబాద్‌లో రోడ్డుపై బైటాయించి ధర్నాకు దిగారు. ఈ క్రమంలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి దూషించడమే కాకుండా, మతపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ దుర్భాషలాడినట్టు మీడియాలో వచ్చింది. విధుల్లో ఉన్న ఏసీపీ, సీఐలపై కూడా ఆయన దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఎమ్మెల్యేను విడుదల చేసినప్పటికీ, ఆయనపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. కౌశిక్‌రెడ్డిపై భారత న్యాయ సంహిత కింద కఠినమైన సెక్షన్లను నమోదు చేశారు. 295ఏ, 196 (మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టడం), 353 (ప్రభుత్వ ఉద్యోగి విధులకు అడ్డుతగలడం)ఇతర సెక్షన్లు 341, 140 3ఏ, 506, 126 (2), 132, 299 వంటి సెక్షన్ల కింద హుజూరాబాద్ పోలీసులు కేసులు ఫైల్ చేశారు.కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల సంఘాలు అత్యంత తీవ్రంగా పరిగణించాయి. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, విధుల్లో ఉన్న అధికారిపై మతం పేరుతో దూషణలు చేయడం గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. కౌశిక్‌రెడ్డి తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాయి. ఈ మేరకు తెలంగాణ ఐఏఎస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామకృష్ణారావు, జయేష్‌రంజన్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రభుత్వ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు కౌశిక్‌రెడ్డి ఒక వీడియో సందేశం ద్వారా తన వ్యాఖ్యలకు చింతిస్తున్నట్టు ప్రకటించారు. 'పోలీసులంటే నాకు గౌరవం ఉంది. నాపై ప్రభుత్వం రాజకీయ కక్ష సాధిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం ఇక్కడి పోలీసులు నాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. నా సొంత ఊర్లో జాతరకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కలిగిన తీవ్ర ఒత్తిడిలోనే ఆ మాటలు అన్నాను తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించండి' అంటూ కోరారు. ప్రస్తుతానికి క్షమాపణతో ఈ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని కౌశిక్‌రెడ్డి భావిస్తున్నప్పటికీ, ఆయనపై నమోదైన కేసులు, ఐపీఎస్ సంఘం ఆగ్రహం అంత సులభంగా సమసిపోయేలా లేవు.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

(మొదటి పేజి తరువాయి)

ఈ రోజు వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జి.ఎ.డి సర్వీసెస్ శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు.

÷ూష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు?ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సి.ఎస్ స్పష్టం చేశారు.పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ : అనంతరం పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సి.ఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశు సంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.

శువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# కొలువుదీరిన సమ్మక్క..

(మొదటి పేజి తరువాయి)

కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. జాతర ప్రశాంతంగా సాగుతోందని అధికారులు తెలిపారు.

ఈ జాతరకు ప్రముఖుల తాకిడి కూడా కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ శుక్రవారం మేడారం సందర్శించి, సంప్రదాయ వస్త్రధారణలో తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆయనకు జాతర ప్రాశస్త్యాన్ని వివరించారు. వీరితో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు కొండా సురేఖ, భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం అమ్మవార్లను దర్శించుకున్నారు.

జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం గురువారం రాత్రి జరిగింది. చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని గిరిజన సంప్రదాయాల నడుమ మేడారంలోని గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్క తల్లి ప్రయాణం ప్రారంభమవగానే, జిల్లా ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అర్ధరాత్రి దాటాక సమ్మక్క తల్లి గద్దెపైకి చేరారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరగా, సమ్మక్క తల్లి కూడా చేరడంతో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

# పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు: పవన్ కల్యాణ్

**జనవరి 30ప్రజావినికిడి,**

"నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు.గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

## -కామన్ స్కూల్ ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుంది,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మలు

## -దేశంలో భూసంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు-





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆలోచన చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజక వర్గంలో అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే ప్రారంభించామని వివరించారు.మా సంకల్పం గొప్పది ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే, అన్ని వనరులు సమకూరితే తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకం ప్రవేశపెడతామని తెలిపారు.ఎదిగే వయసులో పిల్లలకు సరైన ఆహారం లేక పరిపూర్ణంగా ఎదగలేక పోతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తుందని తెలిపారు.

కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుంది చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయాం అనే భావన కులం, మతం, ధనిక , పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజక వర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే గొప్ప మానవ వనరులు ఉండాలి,మానవ వనరులకు సానపడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుంది అందుకు కావలసింది ఉచితంగా అందరికీ విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వం ప్రధానంగా ఈ రెండు అంశాలపైనే దృష్టి సారించి ముందుకు పోతుందని అన్నారు.ఈ ఆలోచనలో భాగంగానే పాఠశాల నిర్వాహకులు పిలవగానే గత సంవత్సరం జనవరి మాసంలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలకు వచ్చి పది కోట్లు కేటాయించారని వివరించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

గత పాలకులు ఐఐటీలను అనాధలుగా వదిలేస్తే మారిన కాలానికి అనుగుణంగా వాటిలో శిక్షణ ఇవ్వాలని,ఆధునిక యంత్ర పరికరాలను తీసుకువచ్చి ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చి ఉపాధి పొందేందుకు అవసరమైన సిలబస్ను రూపొందించామనిరాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని ఐటిఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 15 రోజుల వ్యవధిలోనే అధికారులతో నివేదిక తెప్పించుకొని డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు.

హైదరాబాద్ చుట్టూ ఆధునిక ఆసుపత్రుల నిర్మాణం జరుగుతుంది,జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించామని వివరించారు. రాష్ట్రంలోని మహిళలందరికీ నాణ్యమైన చీరలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి పంపిణీ చేస్తున్నాం వారిని మహాలక్ష్ములుగా గౌరవిస్తున్నామని తెలిపారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నాం మొదటి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామంటే అంతా నవ్వారు కానీ మేం పట్టుదలతో మొదటి ఏడాది 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కులను మహిళాసంఘాలకు పంపిణీ చేసి ఇది సాధ్యమని నిరూపించినట్లు వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఈ తరానికి తెలిసి ఉండకపోవచ్చు ఈ దేశంలో భూ సంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు అని వివరించారు.దివంగత ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు,మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్ హర గోపాల్ వంటి అనేకమంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి సమాజానికి అందించిందని తెలిపారు.





రాజు దైవంశ సంభూతుడు అన్న భావన ఒకవైపు, భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం మరోవైపు కొనసాగుతున్న రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమాలు నడిపించి నిజాం వ్యతిరేక పోరాటం చేసిన గొప్ప నాయకుడు బూర్గుల రామకృష్ణారావు అని తెలిపారు. బూర్గుల మొదట న్యాయవాద వృత్తిని చేపట్టిన తన జీవితం ప్రజల కోసం ఉపయోగపడాలని రాజకీయాల్లోకి వచ్చారని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ ముఖ్యమంత్రిగా 1950-54 మధ్యకాలంలో కౌలు గారి చట్టం తీసుకువచ్చి సాగు చేసుకునే వారికి భూమిపై హక్కులు కల్పించి దేశంలో భూసంస్కరణలకు బూర్గుల ఆధ్వర్యంలో నిలిచారని తెలిపారు.జాగిరి దారి వ్యవస్థ, వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారని తెలిపారు.దేశంలో 1970లో తీసుకువచ్చిన భూ సంస్కరణల చట్టానికి బూర్గుల బాధ్యుడిగా నిలిచారని తెలిపారు.సాయుధ పోరాటం వంటి సమస్యలకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కారం చూపిన మహానేత బూర్గుల అని వివరించారు.

150 సంవత్సరాల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాల గొప్పది ఈ పాఠశాలలో 1952 వరకు ఉర్దూ మీడియం లో కొనసాగగా,ఆ తరువాత తెలుగు మీడియాను ప్రవేశపెట్టారని వివరించారు. 2008లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉండాలని పట్టుబట్టి ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడంపై ఆరోజు శాసనమండలిలో చర్చ జరుగుతుండగా నాటి సీఎం వైఎస్ ఆనాడు ఎమ్మెల్సీగా ఉన్న తన వైపు చూసి మాట్లాడవలసిందిగా సూచించారని గుర్తు చేశారు.

బిడ్డలు చదువుకుంటే ఉద్యోగాలు, ఉపాధి సాధిస్తారని తల్లిదండ్రులు కూలి నాలి చేసి పంపుతున్నారు తీరా ఉద్యోగం రాకపోతే వారు కూలీలుగా మారిపోతున్నారు ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ తప్పనిసరి అయింది, ప్రపంచం కు గ్రామంగా మారింది,ఇంగ్లీష్ ప్రపంచ భాష అది నేర్చుకుంటేనే ఉపాధి భవిష్యత్తు ఉంటుందని ఆనాడు సభలో తన అనుభవాలను వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రొఫెసర్ హరగోపాల్,విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,గ్రామ సర్పంచ్ కృష్ణయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ బండారి సంతోష,జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లాల్ పహాడ్ సూర్య హాస్పిటల్ ముసుగులో

# నకిలీ డాక్టర్ల దందా!

### డాక్టర్ ఒకరు.. వైద్యం మరొకరు..

### ఆర్ఎంపీల చేతిలో పసిపిల్లల ప్రాణాలు..




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగుడా మండలం లాల్ పహాడ్ చౌరస్తా లో సూర్య యగ్నోసిస్ సెంటర్ పేరుతో అక్రమ ల్యాబ్ నడిపిస్తున్న వైనం

బ్లడ్ గ్రూపునే మార్చేసిన ఘనుడు: (A+)రక్తాన్ని (B +)గా మార్చి డ్రామాలు!

అనుమతి లేని ల్యాబ్..అన్నీ నకిలీ రిపోర్టులే: కాసుల కోసం కక్కుర్తి!

అనుమతి లేని ల్యాబ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్న బాధితులు

పాత నేరస్థుడికి కొత్త అడ్డా:సీజ్ అయిన హాస్పిటల్ నుండి ఇక్కడికి మకాం! మార్చిన నకిలీ డాక్టర్ మల్లేష్

అధికారుల కళ్లు గప్పి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సూర్య హాస్పిటల్ అలాగే సూర్య ల్యాబ్ వెంటనే సీజ్ చేయాలని డిమాండ్!

రంగారెడ్డి జిల్లా చౌదర్‌గూడ మండలం లాల్‌పాడ్ గ్రామంలో ఉన్న సూర్య చిన్నపిల్లల మరియు జనరల్ హాస్పిటల్ సామాన్య ప్రజల ప్రాణాలను బలిపీఠంపై పెడుతోంది.డాక్టర్ బి. రామకృష్ణ పేరు మీద అనుమతులు పొంది, లోపల మాత్రం అర్హత లేని ఆర్ఎంపీ డాక్టర్లతో అక్రమంగా వైద్యం చేయిస్తూ పసిపిల్లల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

షాకింగ్: ఎలాంటి అనుమతులు లేకుండా సూర్య డయాగ్నోసిస్ సెంటర్ పేరుతో ల్యాబ్ ను నడిపిస్తూ రక్త గ్రూపునే మార్చేశారు! దేవాన్ష్ అనే మూడు సంవత్సరాల బాబు అనారోగ్యంతో వస్తే, చికిత్స పేరిట ఆ హాస్పిటల్ యాజమాన్యం చేసిన మోసం వర్ణనాతీతం. బాబు అసలు బ్లడ్ గ్రూప్ బి పాజిటివ్ (A +) కాగా,అక్కడ ఉన్న నకిలీ డాక్టర్లు మరియు నకిలీ డయగ్నోసిస్ సెంటర్ దాన్ని (B +) గా మార్చి రిపోర్టు ఇచ్చారు.అంతటితో ఆగకుండా బాబుకు డెంగ్యూ,మలేరియా సోకాయని, ప్లేట్లెట్స్ పడిపోయాయని అబద్ధాలు చెప్పి తల్లిదండ్రులను వణికించారు.రూ. 5,000 కడితేనే అడ్మిట్ చేసుకుంటామని, లేదంటే ప్రాణానికే ప్రమాదమని బ్లాక్ మెయిల్ కు దిగారు.

### అనుమతి లేని ల్యాబ్.. అన్నీ అక్రమాలే!

సూర్య హాస్పిటల్‌లో నడుస్తున్న బ్లడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. కనీసం టెక్నీషియన్ కూడా లేని ఆ ల్యాబ్‌లో నకిలీ ల్యాబ్ టెక్నీషియన్లు రిపోర్టులు తయారు చేస్తూ రోగులను దోచుకుంటున్నారు. షాద్‌నగర్‌లోని స్టార్ కిడ్స్ హాస్పిటల్‌లో పరీక్ష చేయించగా బాబుకు అసలు ఏ రోగమూ లేదని, కేవలం వాతావరణ మార్పుల వల్లే జ్వరం వచ్చిందని తేలడంతో ఈ హాస్పిటల్ దందా బట్టబయలైంది.

### నకిలీ డాక్టర్ 'మల్లేష్' మళ్ళీ ప్రత్యక్షం!

గతంలో 2019లో అమృత హాస్పిటల్‌లో నకిలీ డాక్టర్‌గా చలామణి అవుతూ పట్టుబడిన మల్లేష్ అనే వ్యక్తిపై అప్పటి డిప్యూటీ DMÊHO కఠిన చర్యలు తీసుకున్నారు. ఆనాడు అమృత హాస్పిటల్‌ను సీజ్ చేసినా,బుద్ధి మారని సదరు నకిలీ డాక్టర్ ఇప్పుడు సూర్య హాస్పిటల్ ముసుగులో మళ్ళీ పసిపిల్లలకు ఇంజెక్షన్లు ఇస్తూ ప్రమాదకరంగా మారాడు.వేరొక డాక్టర్ లైసెన్స్‌ను అడ్డం పెట్టుకుని ఈ దోపిడీ సాగిస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు.



జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంటనే స్పందించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి,ఈ మృత్యు కూపాన్ని మూసివేయాలని బాధితులు కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### తక్షణమే సీజ్ చేయాలి బాధితుల డిమాండ్

ఒకరి పేరుతో పర్మిషన్ తీసుకుని,మరొకరు వైద్యం చేయడం.. అనుమతి లేని ల్యాబ్‌లు నిర్వహించడం.. తప్పుడు రిపోర్టులతో ప్రాణాపాయం కలిగించడం వంటి చర్యలకు పాల్పడుతున్న సూర్య హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




# సీనియర్ జర్నలిస్ట్ "కేపీ" స్ఫూర్తితోనే ఈ అవార్డు దక్కింది.: జర్నలిస్ట్ శంకర్..

### జాతీయ సమైక్యత పురస్కారం గ్రహీత జర్నలిస్టు శంకర్ కు ఘన సన్మానం.



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**జాతీయ సమైక్యత పురస్కారం అందుకున్న జర్నలిస్టు శంకర్‌ను టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజాపాషా కెపి, టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ మీడియా అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు కెపి స్వగృహంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఖాజాపాషా మాట్లాడుతూ, రచయితగా,జర్నలిస్టుగా శంకర్ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన విజ్ఞానం ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడాలని, సమాజ హితం కోసం అక్షరాలు మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. యువ జర్నలిస్టులకు ఆదర్శంగా నిలవాలని ఆశీర్వదించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకోవాలని అభినందించారు. టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ,అన్యాయం జరిగిన ప్రతి చోట జర్నలిస్టులు ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని అన్నారు.ప్రజా సమస్యలను వెలికి తీయడంలో మరింత కృషి చేయాలని సూచించారు. ప్రజల విశ్వాసమే జర్నలిస్టుకు గొప్ప బలం అని పేర్కొన్నారు. శంకర్ మాట్లాడుతూ,సీనియర్ జర్నలిస్టు ఖాజా పాషాని స్ఫూర్తిగా తీసుకుని మొదట తన కథనాలను ప్రారంభించానని తెలిపారు. అనంతరంరచనలు కొనసాగించేందుకు ఆయన ప్రోత్సాహమే తనకు ధైర్యం ఇచ్చిందన్నారు.ఈ గుర్తింపు రావడానికి ఖాజా పాషా మార్గదర్శకత్వమే కారణమని,వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల పక్షాన కలం నడిపిస్తూ నిజాయితీతో సేవలు కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శివ, వానరాసి జగన్,తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ చౌరస్తా విస్తీర్ణం కోసం లక్ష సంతకాలకు మద్దతు తెలిపిన పట్టణ ఆర్యవైశ్యులు

**మద్దతు తెలిపిన ఆర్యవైశ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేసిన ఆర్.ఎన్.రాము**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణ ముఖ్య కూడలి చౌరస్తా విస్తీర్ణం కోసం షాద్ నగర్ యువకుడు ఆర్.ఎన్.రాము చేపట్టిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమానికి పట్టణ ఆర్యవైశ్య సభ్యులందరూ స్వచ్ఛందంగా తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.ఎన్నో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారి,ఎంతోమంది నిండు ప్రాణాలు బలిగొన్న షాద్ నగర్ పట్టణ చౌరస్తా విస్తీర్ణం కోసం షాద్ నగర్ పట్టణ యువకుడు ఆర్ఎన్ రాము పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించి చివరకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో,లక్ష సంతకాల సేకరణ కార్యక్రమానికి పట్టణంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో తమ మద్దతును తెలిపి చౌరస్తా విస్తీర్ణం కోసం తమ సంఘీభావాన్ని ప్రకటిస్తూ సంతకాలు చేశారు.చౌరస్తా విస్తీర్ణం చేయకుంటే ధర్నా చేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపినట్లు ఆర్ ఎన్ రాము తెలిపారు.లక్ష సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎంసాని శ్రీను,కట్ట ప్రవీణ్,వెంకట రమణ,కల్వ మాణిక్యం,మలిపేద్ది శ్రీను,గందే సురేష్,నవీన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ

**భారీగా తరలి వచ్చిన బిజెపి శ్రేణులు..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీలో బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా బిజెపి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్,బిజెపి రాష్ట్ర నాయకులు ప్రకాష్ రెడ్డి,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందె బాబయ్య,దేపల్లి అశోక్ గౌడ్,వెంకటేష్ గుప్త,మహేందర్ రెడ్డి,మనోహర్ రెడ్డి, అముడాపురం నర్సింహా,ప్యాట అశోక్,వంశీ కృష్ణ,హరి భూషణ్,మల్చలం మురళి తదితరులు పాల్గొన్నారు. రాజ్ భూపాల్ మాట్లాడుతూ,గత ప్రభుత్వాలు అబద్ధపు హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసారని మండిపడ్డారు.మున్సిపాలిటీల అభివృద్ధి లో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు.గత పదకొండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.రాబోయేమున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, మున్సిపాలిటీ అభివృద్ధి కి సహకరించండి అని అన్నారు. నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,మున్సిపాలిటీల అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని,గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందాయని అన్నారు.నిరుద్యోగ యువత ను, మహిళలను,కార్మికులను,బడుగు బలహీన వర్గాల ప్రజలను మోసం చేసిన పార్టీలు కాంగ్రెస్ బీఆర్ఎస్ అని అన్నారు.ఆ రెండు పార్టీలు ఒకటేనని,ఆ రెండు పార్టీ లను ప్రజలు నమ్మవద్దని,ప్రజలు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి,షాద్ నగర్ మున్సిపాలిటీని అభివృద్ధి పదం లో నడపాలని కోరారు.అందె బాబయ్య మాట్లాడుతూ,
అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి యే బిజెపి లక్ష్యమని,మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి వికసిత్ భారత్ లో మన వంతు కృషి చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమం బోయ కురుమయ్య,మోటె శ్రీనివాస్,ఎన్ ప్రవీణ,ఎంకనోళ్ల వెంకటేష్,విట్యాల నర్సింలు,బిజెపి మండల అధ్యక్షులు చిట్యం లక్ష్మీకాంత్ రెడ్డి, పిట్టల సురేష్,రొల్లు రాధిక,పోటీ చేసే అభ్యర్థులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం

**సమ్మక్క జాతరలో కవిత ఆవేదన**



ములుగు,**జనవరి 30ప్రజావినికిడి,** తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్లు వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. మన హక్కులను సాధించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. తల్లుల దయతో తెలంగాణ బాగుండాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

## మీ అక్షరాలు అన్యాయంపై ఆయుధాలుగా మారి

# నిర్భయంగా ప్రశ్నించాలి

**- సర్పంచ్ ఆర్ బాబు నాయక్**

**జాతీయ సమైక్యత పురస్కారం గ్రహీత జర్నలిస్టు శంకర్‌కు ఘన సన్మానం**

**గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్,ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ఘన సత్కారం**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఫరూక్‌నగర్ మండలం వెలి జర్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, రచయిత శంకర్ జాతీయ సమైక్యత ఉత్తమ పురస్కారం అందుకోవడం గ్రామానికి గర్వకారణంగా ఉందని గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ అన్నారు.గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో వెలి జర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్,వార్డు సభ్యులు కలిసి జర్నలిస్టు,రచయిత శంకర్‌కు శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా అభినందించారు.జర్నలిజం, రచనా రంగాల్లో శంకర్ కనబరిచిన ప్రతిభ,సమాజ సమస్యలపై ఆయన చూపిన నిబద్ధతను వారు ప్రశంసించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ బాబు నాయక్ మాట్లాడుతూ,రచయితగా, జర్నలిస్టుగా జాతీయ స్థాయి అవార్డులు అందుకోవడం వెలి జర్ల గ్రామానికి గర్వకారణం. శంకర్ కలం సమాజంలో మంచి మార్పుకు దారి చూపుతోంది. యువతను ఆలోచింపజేసేలా,ప్రజల్లో చైతన్యం నింపేలా ఆయన రచనలు ఉండటం అభినందనీయము. భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజా సమస్యలపై స్పందిస్తూ..
యువతకు ఆదర్శంగా నిలవాలి అని ఆకాంక్షించారు.
ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ,ప్రజలను చైతన్యపరిచే శక్తివంతమైన వేదిక. ప్రజాస్వామ్య పునాదులైన పరిపాలనా వ్యవస్థ,న్యాయ వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలు నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పనిచేస్తున్నాయా లేదా అన్నదాన్ని నిరంతరం గమనిస్తూ, తప్పుదారి పట్టినప్పుడు తట్టి లేపే బాధ్యత మీడియాపైనే ఉంటుంది.
వ్యవస్థలు నిద్రావస్థలోకి జారుకున్నప్పుడు..ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ధైర్యం చూపించేది మీడియానే.
అన్యాయాన్ని వెలుగులోకి తీసుకురావడం, అవినీతిని ఎండగట్టడం, సామాన్యుడి సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని జీవంతంగా ఉంచుతుంది.ఈ క్రమంలో నిజాయితీగల జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం.వ్యక్తిగత లాభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా, సమాజ హితం కోసమే కలం కదిలే జర్నలిస్టులే ప్రజాస్వామ్యానికి నిజమైన కాపలాదారులు.వారి అక్షరాలు ప్రజల్లో చైతన్యం నింపి, మార్పుకు బాటలు వేస్తాయి.ప్రజల నమ్మకమే మీడియాకు అసలైన బలం.
ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,సత్యం వైపు నిలిచినప్పుడే మీడియా ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షకుడిగా నిలుస్తుందన్నారు.సన్మానం అనంతరం జర్నలిస్టు శంకర్ స్పందిస్తూ,ఈ సత్కారం తనపై మరింత
బాధ్యతను పెంచింది. సమాజ హితం కోసం నిజాయితీగా పనిచేస్తూ, ప్రజలసమస్యల పరిష్కారానికి తన రచనలు అంకితం చేస్తాను.ప్రజల పక్షాన నా కలంతో నిరంతరం గళం వినిపిస్తాను అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాత్లవత్ వెంకటేష్, రమేష్, దేవేందర్,వడ్ల ఆచారి,గ్రామస్తులు మంగలి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిగిద్ద కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి,మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే శంకర్

**విద్యార్థినీలతో కలిసి భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీసిన మంత్రులు,ఎమ్మెల్యే**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వసంతాల కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రి పొన్నం ప్రభాకర్ అకస్మాత్తుగా స్థానికంగా ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో,వసతి గృహంలో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యార్థినీలతో మాట్లాడుతూ, ఏ క్లాస్ చదువుతున్నారు.పాఠశాల ఎలా ఉంది,భోజన వసతులు ఎలా ఉన్నాయి..ఈ లక్ష్యంతో ప్రస్తుతం పాఠశాలలో చదువుకుంటున్నారు.పెద్దయ్యాక ఏం చేయాలనుకుంటున్నారు,ఆ కోరికను సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలు మీ వద్ద ఉన్నాయి అంటూ డిప్యూటీ సీఎం విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహంలో బోధన,బోధ నేతర అంశాలపై నిర్వాహకులను ప్రశ్నించి పలు విషయాలు ఆరా తీశారు.

## కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర

**మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక**

**గవర్నర్, డిజిపి, మంత్రుల దర్శనాలు**



మేడారం,**జనవరి 30ప్రజావినికిడి,**
వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు

# సంజీవని ఓ విప్లవం

## రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం

**పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి: సీఎం చంద్రబాబు**

**గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి**



గుంటూరు**జనవరి 30ప్రజావినికిడి,**
ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి-జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూ
ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

**అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

**దాతృత్వానికి నిలువుటద్దం**

గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. 2.69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో మొత్తం 600 పడకలు ఉన్నాయి. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డాక్టర్ గవిని ఉమాదేవి (రూ.22 కోట్లు), నళిని-వెంకట్ తేళ్ల (రూ.8 కోట్లు) సహా పలువురు దాతలు భారీగా విరాళాలు అందించారు. నాట్కో ఫార్మా కూడా వివిధ అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.రు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు

## ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు




హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,** టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎడ్ సెట్ లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ద్వార అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు పిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. .బయాలజీ, పిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు స్జబెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యబ్ లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.

## నాంపల్లి ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాదం

### కంటతడి పెట్టిస్తున్న మృతుడి ఫోన్ కాల్ ఆడియో

### రక్షించాలంటూ వేడుకున్న ఇంతియాజ్

హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,:** నాంపల్లి ఫర్నీచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న షాపులోని సెల్లార్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఐదుగురు మరణించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఒక బాధితుడి కాల్ రికార్డింగ్
ఆడియో లీకైంది. మృతుల్లో ఒకరైన ఇంతియాజ్ అనే యువకుడు.. అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి, రక్షించమని వేడుకున్నాడు. తాను మంటల్లో లోపల చిక్కుకున్నట్లు, బయటకు రావడానికి ఏమీ కనిపించడం లేదని స్నేహితుడికి చెప్పాడు. అందులోంచి బయటకు రావడానికి అన్ని దారులు మూసుకుపోయాయని ఫోన్లో చెప్పాడు. తనతోపాటు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఇంతియాజ్‌కు సంబంధించిన ఈ ఆడియో వైరల్ అవుతోంది. ప్రాణాలు కోల్పోవడానికి కొద్ది సేపటి ముందు కాల్‌లో అతడి ఆవేదన అందరినీ కలిచివేస్తోంది. చివరి క్షణాల్లో బాధితుల వేదన కూడా రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి.. సెల్లార్‌లోని ఫర్నీచర్ షాపులో మంటలు చెలరేగి, భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లోపల ఉన్న ఐదుగురు అందులో చిక్కుకుపోయారు. చుట్టూ పొగ, మంటల ధాటికి బయటికి రాలేకపోయారు. బయటికొచ్చే ఏ మార్గం లేకపోవడంతో అందులోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందరూ బయటికొచ్చేశారు. లోపల గార్డు యాదయ్య కుమారులు ప్రణీత్, అఖిల్ ఉండిపోయారు. వారిని కాపాడేందుకు ఉస్మాన్ ఖాన్, ఆయన భార్య బేబి, ఇంతియాజ్ వెళ్లారు. చివరకు ఈ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

------

## ఏప్రిల్ 19న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష



హైదరాబాద్,**జనవరి 30ప్రజావినికిడి,** తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకొరకు ఇప్పటికే అడ్మిషన్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆరవ తరగతినుంచి 10 వ తరగతి వరకు అడ్మిషన్లకు పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి28 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఏప్రిల్ 19న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.
మోడల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఓబీసీలు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125 లు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష రెండు దఫాలుగా నిర్వహిస్తారు. ఉదయం 10గంటల ఉంచి మధ్యాహ్నాం 12 గంటల వరకు ఆరవ తరగతి విద్యార్థులకు, 7తరగతినుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నాం 2గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.

-----

## బొజ్జగూడెం తండాలో మహాత్మాగాంధీ వర్ధంతి...

### - జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం ఘనంగా




**జనవరి 30ప్రజావినికిడి,)** అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా గ్రామంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి గ్రామ సర్పంచ్ గుగులోతు నీలబాయి, శ్రీనివాస్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు...ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం, గాంధీజీ ఆశయాలు, సమాజ సేవలో ఆయన చేసిన కృషిని గ్రామస్తులకు వివరించారు.కుష్టువ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్యా నాగమణి, రవి, పంచాయతీ కార్యదర్శి కె. ఉపేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని మహాత్మాగాంధీకి ఘన నివాళులు అర్పించారు. గ్రామంలో సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

------

## మేడారం జాతరను సందర్శించుకున్న తలసాని

### అమ్మవార్లకు ఎమ్మెల్యే మొక్కులు



ములుగు,**జనవరి 30ప్రజావినికిడి,** మేడారంలో సమ్మక్క, సారక్క జాతర వైభవంగా కొనసాగుతుంది. జాతర అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం మేడారం జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారక్కను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బంగారం సమర్పించి అమ్మవార్లను వేడుకున్నారు. జాతరలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేను ఆపార్యంగా పలకరించారు. సీతక్క వారికి అమమవారి దర్శనం చేయించారు.

# తెలంగాణ ప్రయోజనాలను వదులుకోం



**పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు**

**హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి**

**పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్**

**మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద**జనవరి 30ప్రజావినికిడి,** కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి..

# వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?

**జనవరి 30ప్రజావినికిడి,**
ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళు తున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది. ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు. ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.




ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతుండటం విశేషం. మన దేశ సంభావ్య వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది. దేశీయ డిమాండ్.. వృద్ధికి వెన్నెముక ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన బఫర్స్ భారత్ వద్ద ఉన్నాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది.


విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా ఆర్థిక సర్వే ఆశాజనక సూచనలు చేసినా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితి ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పేదరికం ఇంకా పెరుగుతోంది. వీటిని సమీక్షించాల్సిన అసవరం ఉంది. ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు రావాలి. సమస్యలను చర్చించి, అధిగమించే ప్రయత్నాలు చేపట్టాలి. అప్పుడే ఆర్థికంగా దేశం బలోపేతం కాగలదు.

## సహిత సహస్రచండీ మహాయాగానికి హాజరైన ఈటల రాజేందర్‌స్థానిక కార్పొరేటర్ లు

### అమ్మవారికి ప్రత్యేక పూజలు..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
లోక కల్యాణం కోసమై,దేశ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో జగన్మాత సేవలో శ్రీ మెల్లూరి నవీన్ శర్మ నిర్వహణలో రాగన్నగూడలో నిర్వహించబడుతున్న మహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగానికి శుక్రవారం రోజు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హయత్ నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి దివ్య ఆశీస్సులను పొందడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

### రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని -మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు

న్యూఢిల్లీ**జనవరి 30ప్రజావినికిడి,**
మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.
ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి,





ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళు లు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### ఒక్కరోజులోనే 5లక్షల కోట్లకు క్రాష్ -సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్

న్యూఢిల్లీ,**జనవరి 30ప్రజావినికిడి,**
ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవుతున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం
ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ



ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది. బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, ఆల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.పసిడితో పాటు వెండి, ఎ÷-లాటినమ్, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్
చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపోవచ్చని ప్రముఖ కన్‌స్టలెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు.

## విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలు

### 27మందికి మంత్రి గొట్టిపాటి నియామక పత్రాలు

అమరావతి,**జనవరి 30ప్రజావినికిడి,**
విద్యుత్ శాఖలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 27 మంది అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా విద్యుత్ శాఖలోని పలు సంస్థల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హత మేరకు ఇంజినీరింగ్ ఉద్యోగాలు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఉన్నత విద్యార్హత ఉన్నవారికి కూడా ఆఫీసు సబార్డినేట్, జూనియర్
అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలకు 600 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చామని.. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సీఎస్ కె. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. ఏడాది లోపు దరఖాస్తు చేసుకోలేకపోయినవారికి కూడా సడలింపులు ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదాలబారిన పడిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులంతా తమ స్కిల్ పెంచుకుంటూ వృత్తిపరమైన అభివృద్ధి సాధించాలని సీఎస్ విజయానంద్ ఆకాంక్షించారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక




# రోహిత్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన పాల్ స్టిర్లింగ్



టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, టీ20 ఫార్మాట్‌లో చాలా రికార్డులే క్రియేట్ చేశాడు. వీటిలో కొన్ని ఇప్పటికీ చెక్కు చెదరలేదు. అయితే హిట్‌మ్యాన్ ఇంటర్నేషనల్ టీ20ల నుంచి రిటైర్ అయిన దాదాపు రెండు సంవత్సరాల తర్వాత.. ఓ రికార్డు బద్ధలైంది. షార్ట్ ఫార్మాట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రోహిత్ గతంలో హిస్టరీ క్రియేట్ చేయగా, ఇప్పుడు ఆ రికార్డును ఐర్లాండ్ కెప్టెన్, ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ బ్రేక్ చేశాడు. 2007లో అరంగేట్రం చేసిన రోహిత్, 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచాక రిటైర్మెంట్ అనౌన్స్ చేశాడు. కెరీర్‌లో మొత్తం 159 ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మైల్‌స్టోన్ చేరుకోవడానికి రోహిత్‌కి 17 సంవత్సరాలు పట్టింది. అయితే నిన్న ఈ రికార్డును పాల్ స్టిర్లింగ్ బ్రేక్ చేసి.. కెరీర్‌లో 160వ ఇంటర్నేషనల్ టీ20 ఆడాడు. 2026 జనవరి 29న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో యూఏఈ వర్సెస్ ఐర్లాండ్ మ్యాచ్.. పాల్ స్టిర్లింగ్ ు20 కెరీర్‌లో 160వది. ఆసక్తికరంగా స్టిర్లింగ్ కూడా తన ు20 కెరీర్‌లో 17వ సంవత్సరంలో ఉన్నాడు. రోహిత్ లాగానే, ఐర్లాండ్ టీమ్‌లో అతను ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తాడు. ప్రస్తుత సిరీస్‌లో యూఏఈతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఆ తర్వాత శ్రీలంకలో 2026 ు20 ప్రపంచ కప్ స్టార్ట్ అవుతుంది. అంటే ఐర్లాండ్ వరుసగా టీ20 క్రికెట్ ఆడుతుంది. దీంతో స్టిర్లింగ్ రాబోయే నెలల్లో రోహిత్‌పై తన ఆధిక్యం పెంచుకునే అవకాశాలు స్టిర్లింగ్ ఇప్పుడు టాప్ ప్లేస్‌లో ఉన్నప్పటికీ, ఈ రికార్డు ఎక్కువ కాలం నిలవకపోవచ్చు. ఎందుకంటే ఇప్పుడు ు20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు గతంలో కంటే చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. మిగతా రెండు ఫార్మాట్ల కంటే టీ20లు చూడటానికే ఫ్యాన్స్ ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ జనరేషన్ ప్లేయర్స్‌కి ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కుతుంది. పాకిస్తాన్‌కు చెందిన 31 ఏళ్ల బాబర్ ఆజం ఇప్పటికే 137 టీ20లు ఆడాడు. ఇండియన్ స్టార్ ఆల్‌రౌండర్ 32 ఏళ్ల హార్దిక్ పాండ్యా 128 మ్యాచ్‌లతో పోటీలో ఉన్నాడు. రాబోయే నెలల్లో వీరు ఈజీగా 150 మార్కును దాటే ఛాన్సులు ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్ (వంటి ప్లేయర్స్ రికార్డ్సని చూస్తే టీ20లకు పాపులారిటీ ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతుంది. కేవలం ఐదు సంవత్సరాల్లోనే సూర్య 103 మ్యాచ్‌లు ఆడాడు. యావరేజ్‌గా సంవత్సరానికి 20 కంటే ఎక్కువ గేమ్‌లలో పాల్గొన్నాడు. ఇదే స్పీడ్ కంటిన్యూ అయితే, ఈ దశాబ్దం చివరి నాటికి ఒక ప్లేయర్ 200 మ్యాచ్‌లకు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఉన్నాయి. అరుదైన రికార్డు అందుకున్న మ్యాచ్‌లో స్టిర్లింగ్ 8(3)కే అవుట్ అయ్యాడు. అయితే ఐర్లాండ్ 178 పరుగులు చేయగలిగింది. యూఏఈ ఛేజింగ్‌లో 121కే ఆలౌట్ అయింది. రెండో టీ20 మ్యాచ్ జనవరి 31న జరుగుతుంది.

# కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ మాయం..




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ గురువారం (జనవరి 29న) రాత్రి అకస్మాత్తుగా మాయమైంది. అయితే తాను సోషల్ మీడియా నుంచి వెళ్లిపోతున్నాను లేదా కొంతకాలం దూరంగా ఉంటున్నాను అని ఎలాంటి పోస్ట్ చేయలేదు. దాంతో విరాట్ కోహ్లీ అభిమానులు ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ మిస్ కావడంపై ఆశ్చర్యపోయారు. క్రికెటర్ కోహ్లీనే తన అకౌంట్ డిలీట్ చేశాడా లేదా ఏదైనా కారణాలతో జరిగిందా అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల పరంగా చూస్తే క్రికెటర్లలో విరాట్ కోహ్లీనే నెంబర్ వన్. ప్రపంచంలో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఆటగాళ్లలో కోహ్లీ ఒకడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీకి 274 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా కోహ్లీ అభిమానులు అతని ఇన్‌స్టా అకౌంట్ సెర్చ్ చేయగా ఏమీ కనిపించడం లేదు. అసలేం జరిగింది అని కింగ్ కోహ్లీ ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం తన కుటుంబంతో కలిసి లండన్‌లో నివాసం ఉంటున్నాడు. కోహ్లీ, అనుష్క శర్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అతను టెస్ట్, టీ20 ఫార్మాట్ల నుండి రిటైర్ అయ్యాడు. కోహ్లీ కేవలం వన్డేల్లో మాత్రమే టీమిండియా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ కోసం కోహ్లీ భారతదేశానికి వచ్చాడు, ఆ సిరీస్ ముగిసిన వెంటనే లండన్ తిరిగి వెళ్ళాడు. విరాట్ కోహ్లీ ఒక్క ఇన్‌స్టాగ్రామ్ పోస్టుకు కోట్లలో సంపాదిస్తారని తెలిసిందే. దాంతో కోహ్లీ సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకున్నాడా అని అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అందుకు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పుడు, ఇద్దరి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు ఏదైనా టెక్నికల్ ప్రాబ్లం కారణంగా కనిపంచడం లేదా, లేక వాళ్లే డీయాక్టివేట్ చేసుకున్నారా అనే ప్రశ్న తలెత్తుతుంది. త్వరలోనే దీనిపై కోహ్లీ స్పందించి పోస్ట్ చేసే అవకాశం ఉంది.

# ఓపెనర్‌గా సంజుకి అదిరిపోయే అవకాశం

వరల్డ్ క్రికెట్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్లు ఈమధ్య పరుగుల వరద పారిస్తున్న విషయం తెలిసిందే. ఐపీఎల్ అయినా, అంతర్జాతీయ మ్యాచులు అయినా సెంచరీలతో విరుచుకుపడుతుంటారు. కానీ వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, టీ20 వరల్డ్ కప్ వేదికపై మాత్రం మనోళ్లు సెంచరీ కొట్టి 16 ఏళ్లు దాటిపోయింది. 2024లో మనం వరల్డ్ కప్ గెలిచినా, ఒక్కరు కూడా వంద మార్కును అందుకోలేకపోయారు. ఇప్పుడు 2026 మెగా టోర్నీకి సమయం దగ్గర పడింది. ఈ తరుణంలో మన యంగ్ బ్యాటర్లు రెండవ సెంచరీ రికార్డును అందుకుంటారా చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఒక టాలెంటెడ్ ప్లేయర్ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. టీ20 వరల్డ్ కప్‌లో భారత్ తరఫున మొట్టమొదటి సెంచరీ సాధించిన రికార్డ్ సురేష్ రైనా పేరిట ఉంది. 2010లో సౌత్ ఆఫ్రికాపై ఆయన ఈ ఘనత సాధించారు. ఇప్పుడు మళ్లీ అదే రైనా, సంజు శాంసన్‌పై తన నమ్మకాన్ని ప్రకటించారు. “ఈ వరల్డ్ కప్‌లో సంజు సెంచరీ సాధించే అవకాశం ఉంది. అతను ఓపెనర్‌గా వస్తున్నాడు, పైగా కావాల్సిన టాలెంట్ ఉంది” అని రైనా పేర్కొన్నారు. ఇప్పటికే సౌత్‌ఆఫ్రికా గడ్డపై రెండు సెంచరీలు బాదిన అనుభవం సంజుకు ఉందని, అందుకే ఆ 16 ఏళ్ల కరవును తీరుస్తాడని రైనా బలంగా నమ్ముతున్నారు. ప్రస్తుతం సంజు శాంసన్ ఫామ్ కొంచెం ఆందోళన కలిగిస్తోంది. గత నాలుగు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు 11, 10, 6, 0, 24 మాత్రమే. అయితే రైనా దీనిపై స్పందిస్తూ “ఫామ్ అనేది తాత్కాలికం, కానీ సంజు క్లాస్ ప్లేయర్.



సూర్యకుమార్ యాదవ్ కూడా ఒక ఏడాది పాటు సరిగ్గా ఆడలేదు, కానీ కోచ్ ఆయనను నమ్మారు. సంజు విషయంలో కూడా అదే జరుగుతుంది” అని మద్దతుగా నిలిచారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సంజు ఇప్పటివరకు 56 మ్యాచ్‌ల్లో 1072 పరుగులు చేశారు. ఆయన స్ట్రైక్ రేట్ (147.86) కూడా టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా అద్భుతంగా ఉంది. వచ్చే వరల్డ్ కప్‌లో సంజు శాంసన్, అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీ20ల్లో ఓపెనర్‌గా రావడం అంటే ఎక్కువ బంతులు ఆడే ఛాన్స్ దక్కుతుంది. అదే జరిగితే సెంచరీ సాధించడం సంజుకు పెద్ద కష్టమేమీ కాదు. ఐపీఎల్‌లో కూడా ఆయన ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి యంగ్ గన్స్ ఉన్నా, సంజు తన అనుభవంతో ఈసారి హిస్టరీ క్రియేట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. పవర్‌ప్లేలో ఆయన బాదే షాట్లు ప్రత్యర్థి టీమ్ కు వణుకు పుట్టించడం ఖాయం. వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సంజుకు తన ఫామ్‌ను నిరూపించుకోవడానికి జనవరి 31న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్ చాలా ముఖ్యం.

## వరల్డ్ కప్‌లో సంజూ సెంచరీ కొడతాడు: భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా

టీ20 ప్రపంచ కప్‌లో భారత్ తరఫున సెంచరీ సాధించిన ఏకైక ఆటగాడిగా ఇప్పటికీ సురేష్ రైనా పేరిట రికార్డు ఉంది. అయితే ఈ ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026కు ముందు భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. టీమిండియా స్టార్ బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ కాకుండా.. మరో ఆటగాడు ఈ మెగా టోర్నీలో సెంచరీ సాధిస్తాడని రైనా జోస్యం చెప్పాడు. ఆ రికార్డును కేరళ స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ సమం చేస్తాడని రైనా ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుతం సంజూ శాంసన్ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నాడు. శుభ్‌మన్ గిల్ జట్టులో లేని సమయంలో ఓపెనర్‌గా వచ్చిన శాంసన్, న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో సంజూ శాంసన్ 10, 6, 0, 24 పరుగులు మాత్రమే చేశాడు. అయినప్పటికీ సురేష్ రైనా మాత్రం సంజూ శాంసన్ సత్తాపై నమ్మకం ఉంచడం గమనార్హం.”సంజూ శాంసన్ కచ్చితంగా సెంచరీ సాధించే ఆటగాళ్ల జాబితాలో ఉంటాడు. ఆయన ఓపెనర్‌గా వస్తున్నాడు కాబట్టి సెంచరీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాలో రెండు సెంచరీలు బాదాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ పోటీలో ఉన్నప్పటికీ, ఈ వరల్డ్ కప్‌లో సంజూనే సెంచరీ కొడతాడని నేను నమ్ముతున్నాను.” అని టీమిండియా లెజెండ్ సురేష్ రైనా పేర్కొన్నాడు.

# ఎంపీ పీటీ ఉష భర్త శ్రీనివాస్ మృతి



భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి. ఉష భర్త వి. శ్రీనివాసన్ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. శ్రీనివాసన్ కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన వయసు 67 సంవత్సరాలు. పీటీ ఉష మరణంపై క్రీడా, ఇతర రంగాల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం తెల్లవారుజామున వి. శ్రీనివాసన్ తన నివాసంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆయనను పరీక్షించిన డాక్టర్లు శ్రీనివాసన్ మృతిచెందినట్లు ప్రకటించారు. అన్ని వైద్య ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన ప్రాణాలు దక్కలేదని.. ఆసుపత్రికి తీసుకువచ్చే సరికి పరిస్థితి చేజారిపోయిందని తెలిపారు. వి. శ్రీనివాసన్ మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. పి.టి. ఉష యొక్క అద్భుతమైన క్రీడా జీవితం మరియు ఆమె రాజకీయ ప్రయాణంలో ఆయన ప్రతి అడుగులోనూ అండగా నిలిచారు. ఆయన ఉషకు బలమైన మద్దతుగా పరిగణించబడ్డారు మరియు ఆమె అనేక వృత్తిపరమైన విజయాల వెనుక చోదక శక్తిగా పరిగణించబడ్డారు. పి.టి. ఉష మరియు వి. శ్రీనివాసన్‌లకు ఉజ్వల్ అనే కుమారుడు ఉన్నారు. వి. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబం గురించే తన ఆలోచనలు ఉన్నాయని, మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా వి. శ్రీనివాసన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. “రాజ్యసభ ఎంపీ మరియు భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.టి. ఉష భర్త శ్రీనివాసన్ మృతి చాలా బాధాకరం. పి.టి. ఉషతో పాటు ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఈ క్లిష్ట సమయంలో దేవుడు ఆమెకు మనోధైర్యాన్ని చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను” అని పోస్ట్ చేశారు.”ఫ్లయింగ్ ఫెయిరీ”గా పిలువబడే పి.టి. ఉష, భారత క్రీడా చరిత్రలో అత్యంత స్ఫూర్తిదాయకమైన వ్యక్తులలో ఒకరు. ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన ఈ నష్టం ఆమెకు మాత్రమే కాకుండా ఆమె ప్రియమైన వారికి కూడా తీవ్ర బాధాకరం. క్రీడాకారులు, కోచ్‌లు, అభిమానులు మరియు ప్రజలు సోషల్ మీడియాలో ఆమెకు నిరంతరం ప్రోత్సాహం మరియు మద్దతు సందేశాలను పంపుతున్నారు.

# సూర్యకు అరుదైన ఫీట్ సాధ్యమేనా..?

క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్ అంటేనే ఒక రేంజ్ క్రేజ్ ఉంటుంది. అందులోనూ వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలో టీమ్ ఇండియాను నడిపించడం అంటే అది ఒక అరుదైన గౌరవం. ఇప్పటివరకు మన జట్టును ముగ్గురు దిగ్గజ కెప్టెన్లు మాత్రమే ఈ టోర్నీలో లీడ్ చేశారు. ఇప్పుడు ఆ జాబితాలోకి మన మిస్టర్ 360 ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ అడుగుపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 7న ముంబై వేదికగా అమెరికాతో జరిగే మ్యాచ్‌తో ఈ కొత్త ప్రయాణం మొదలవ్వబోతోంది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరఫున కెప్టెన్సీ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పటివరకు ‘తలా’ ధోనీ, ‘కింగ్’ కోహ్లీ, ‘హిట్ మ్యాన్’ రోహిత్ శర్మ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు ఈ ముగ్గురి సరసన సూర్యకుమార్ యాదవ్ పేరు చేరబోతోంది. ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగే పోరులో టాస్ వేయగానే.. భారత్‌ను వరల్డ్ కప్‌లో నడిపించిన నాలుగో కెప్టెన్‌గా సూర్య చరిత్ర సృష్టిస్తారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న జట్టుకు నాయకత్వం వహించడం సూర్యకు ఒక పెద్ద సవాలే అని చెప్పవచ్చు. టీ20 వరల్డ్ కప్ లో భారత్ ప్రయాణాన్ని చూస్తే, ఎంఎస్ ధోనీ ఏకంగా ఐదు ఎడిషన్లలో (2007, 2009, 2012, 2014, 2016) జట్టును నడిపించారు. ఆయన సారథ్యంలోనే 2007లో భారత్ మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ 2021లో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నా, దురదృష్టవశాత్తు భారత్ సెమీస్ చేరలేకపోయింది. ఇక రోహిత్ శర్మ 2022లో సెమీస్ వరకు తీసుకెళ్లి, 2024లో అద్భుతమైన విక్టరీతో భారత్‌కు రెండోసారి కప్పు అందించారు. ఇప్పుడు ఈ లెజెండరీ కెప్టెన్ల వారసత్వాన్ని సూర్య ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ముందు ఒక అరుదైన అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఈసారి కప్పు గెలిస్తే.. ధోనీ, రోహిత్ తర్వాత టైటిల్ గెలిచిన మూడో భారత కెప్టెన్‌గా సూర్య నిలుస్తారు. విరాట్ కోహ్లీకి సాధ్యం కాని ఈ ఘనతను సూర్య సాధిస్తాడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉండటం, అలాగే 2024 విక్టరీ తర్వాత టీమ్ ఫుల్ ఫామ్‌లో ఉండటం సూర్యకు కలిసొచ్చే అంశాలు. బ్యాటర్‌గా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సూర్య, ఇప్పుడు లీడర్‌గా తన సత్తా ఏంటో చూపించాలనుకుంటున్నారు. 2026 వరల్డ్ కప్ గనుక భారత్ గెలిస్తే, క్రికెట్ చరిత్రలో ఎన్నో ‘ఫస్ట్ టైమ్’ రికార్డులు మన పేరిట నమోదవుతాయి. మూడు టీ20 వరల్డ్ కప్‌లు గెలిచిన మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టిస్తుంది. అంతేకాదు, వరుసగా రెండు ఎడిషన్లు గెలిచిన తొలి టీమ్ గా కూడా నిలుస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఇప్పటివరకు ఏ ఆతిథ్య దేశం కూడా టీ20 వరల్డ్ కప్ గెలవలేదు. ఈసారి సూర్య సేన గెలిస్తే, హోమ్ గ్రౌండ్‌లో కప్పు గెలిచిన మొదటి దేశంగా భారత్ రికార్డ్ క్రియేట్ చేస్తుంది. 2024 వరల్డ్ కప్ ఫైనల్ అనగానే మనందరికీ సూర్యకుమార్ యాదవ్ పట్టిన ఆ అద్భుతమైన క్యాచ్ గుర్తుకొస్తుంది. సౌత్ ఆఫ్రికా చేతుల్లోకి వెళ్లిన మ్యాచ్‌ను ఆ ఒక్క క్యాచ్‌తో సూర్య భారత్ వైపు తిప్పేశారు. అప్పుడు ప్లేయర్‌గా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించిన సూర్య, ఇప్పుడు నాయకుడిగా ఆ కప్పును కాపాడుకోవాలని చూస్తున్నారు. తన బ్యాటింగ్ స్కిల్స్‌తో పాటు కెప్టెన్సీ వ్యూహాలతో టీమ్ ఇండియాను వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలబెట్టాలని సూర్య పట్టుదలతో ఉన్నారు. మార్చి 8న జరిగే ఫైనల్‌లో సూర్య ఆ ట్రోఫీని ఎత్తుతాడా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సీనియర్లు లేని లోటును సూర్య తన నాయకత్వంతో భర్తీ చేస్తూ భారత్‌కు మూడోసారి ప్రపంచకప్ అందిస్తాడో లేదో చూడాలి.





## ‘వేల్పారి‘... విక్రమ్, రణ్‌వీర్ సింగ్‌లతో

# శంకర్ భారీ మల్టీస్టారర్..!

భారీ చిత్రాల దర్శకుడు శంకర్ కలల ప్రాజెక్ట్‌గా భావిస్తున్న ‘వేల్పారి‘ సినిమాపై మరోసారి ఆసక్తికరమైన ప్రచారం మొదలైంది. ఈ చిత్రాన్ని ఇద్దరు హీరోల కథగా మార్చి, అందులో ప్రధాన పాత్రల కోసం కోలీవుడ్ స్టార్ విక్రమ్, బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్‌లను తీసుకోవాలని శంకర్ ఆలోచిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.ప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ మీడియా ఈ భారీ ప్రాజెక్టును నిర్మించడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్, పూర్తి చేయడానికి పట్టే సమయం వంటి వివరాలను శంకర్‌ను ఆ సంస్థ అడిగినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ఊహాగానాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రముఖ తమిళ రచయిత సు. వెంకటేశన్ రాసిన ‘వీర యుగ నాయగన్ వేల్పారి‘ అనే చారిత్రక నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది.వేల్పారి తమిళనాట గొప్ప దాతృత్వం, ధైర్యసాహసాలకు ప్రసిద్ధి చెందిన రాజు. ఎండిపోతున్న ఒక మల్లెతీగకు తన రథాన్నే పందిరిగా ఇచ్చిన గొప్పదనం ఆయనది. అందుకే ‘ముల్లైక్కు తేర్ కొడుత్తాన్ పారి‘ (మల్లెతీగ కోసం రథాన్ని ఇచ్చిన పారి) అనే సామెత తమిళనాట ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. తమిళ సాహిత్యంలో పేర్కొన్న ఏడుగురు గొప్ప దాతలలో వేల్పారి ఒకరు.గతంలో ఒక కార్యక్రమంలో మాట్లాడిన శంకర్, లాక్‌డౌన్ సమయంలో ‘వేల్పారి‘ పుస్తకం కోసం ప్రయత్నించినా దొరకలేదని, రచయిత సు. వెంకటేశన్ తన సొంత కాపీని చదవడానికి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. 2000 ఏళ్ల నాటి రాజు గురించి అంత గొప్పగా రాసిన ఆ నవల తనను ఎంతగానో ఆకట్టుకుందని శంకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ‘వారణాసి‘ రిలీజ్ డేట్ ఫిక్స్...

## 2027 ఏప్రిల్ 7న విడుదల -అధికారికంగా ప్రకటించిన రాజమౌళి

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం ‘వారణాసి‘ విడుదల తేదీని దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది, అంటే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీపై ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, శుక్రవారం చిత్ర బృందం దీనిపై స్పష్టతనిచ్చింది.

ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకుంటూ, “2027... ఏప్రిల్ 7అని పోస్ట్ చేశారు. దాదాపు అదే సమయంలో మహేశ్ బాబు కూడా ఇదే పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సినిమా విడుదలపై వస్తున్న అన్ని రకాల ప్రచారాలకు తెరపడినట్లయింది.గత ఏడాది హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో వేలాది మంది అభిమానుల సమక్షంలో ఈ సినిమా టైటిల్‌ను అట్టహాసంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఈ చిత్రానికి ‘గ్లోబ్‌ట్రాటర్‘ అనే వర్కింగ్ టైటిల్ ప్రచారంలో ఉండేది. భారత సినీ చరిత్రలోనే అతిపెద్ద ఫ్యాన్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచిన ఆ




కార్యక్రమంలో, సినిమా కోసం ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తు, 130 అడుగుల వెడల్పు గల భారీ స్క్రీన్ అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక ఈ చిత్రంలో మహేశ్ బాబు ‘రుద్ర‘ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ‘మందాకిని‘ పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ‘కుంభ‘ అనే ప్రతినాయకుడి పాత్రలో ప్రేక్షకులను భయపెట్టనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి ఫస్ట్ లుక్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో రాజమౌళి మాట్లాడుతూ, సినిమాలోని ఒక కీలక ఎపిసోడ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “చిన్నప్పటి నుంచి నాకు రామాయణం, మహాభారతం అంటే ఇష్టమని చెప్పాను. మహాభారతం తీయాలన్నది నా కల. కానీ ఈ సినిమా కోసం రామాయణంలోని ఒక ముఖ్యమైన ఘట్టాన్ని చిత్రీకరిస్తానని ఊహించలేదు. మహేశ్ బాబును రాముడి గెటప్‌లో చూసినప్పుడు నాకు ఒళ్ళు గగుర్పొడిచింది“ అని అన్నారు. ఆ ఎపిసోడ్‌ను సుమారు 60 రోజుల పాటు చిత్రీకరించామని, ప్రతి రోజు ఒక సవాల్‌గా అనిపించిందని, తన కెరీర్‌లోనే ఇది అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని రాజమౌళి ధీమా వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# శ్రీనివాస మంగాపురం..


# మంగ గా బాలీవుడ్ బ్యూటీ

టాలీవుడ్ లో ప్రస్తుతం కొత్త టాలెంట్ కు కొదవలేదు. వారసత్వంతో వచ్చే వాళ్లే కాకుండా, ఇతర భాషల నుండి క్రేజీ నటీనటులు కూడా మన దగ్గర పాగా వేస్తున్నారు. ఇప్పుడు ఒక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘శ్రీనివాస మంగాపురం‘ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. హీరో డెబ్యూ అప్‌డేట్ తోనే ఈ ప్రాజెక్ట్ పై మంచి బజ్ క్రియేట్ అయ్యిందిఅజయ్ భూపతి అంటేనే ఒక కల్ట్ రోమాంటిక్ యాక్షన్ స్టైల్ గుర్తుకొస్తుంది. ఆయన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు చాలా వెయిటేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమాలో హీరోయిన్ గా ఎవరిని తీసుకుంటారనేది కొంతకాలంగా సస్పెన్స్ గా మారింది. రీసెంట్ గా ఈ విషయంలో చిత్ర బృందం ఒక క్లారిటీ ఇచ్చింది. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని ఈ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాషా, ఇప్పుడు మన టాలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుండి హీరోయిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో రాషా ‘మంగ‘ అనే పాత్రలో నటిస్తున్నట్లు రివీల్ చేశారు. ట్రెడిషనల్ లుక్ లో రాషా చాలా క్యూట్ గా కనిపిస్తోంది. ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే ఈ సినిమాలో పర్ఫార్మెన్స్ కు స్కోప్ ఉన్న క్యారెక్టర్ లోనే నటిస్తోందని అర్థమవుతోంది. ఇప్పటికే ‘ఉయి అమ్మ‘ గర్ల్ గా నెట్టింట ఫుల్ పాపులారిటీ ఉన్న రాషాకు, ఈ తెలుగు డెబ్యూ సినిమా మరింత మైలేజీని ఇస్తుందని ఫిలిం నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్ లో దాదాపు 30 రోజుల పాటు మొదటి షెడ్యూల్ పూర్తి చేశారు. సినిమాలోని సుమారు 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం రెండో షెడ్యూల్ లో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ తో పాటు సాంగ్స్ ను కూడా చిత్రీకరిస్తున్నారు. 2026 లో ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా తగ్గకుండా టీమ్ మొత్తం పక్కా ప్లానింగ్ తో ముందుకు వెళ్తోంది.లెజెండరీ ప్రొడ్యూసర్ అశ్వినీ దత్ సమర్పణలో, పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ ప్రాజెక్ట్ కు అదిరిపోయే ట్యూన్స్ ఇస్తున్నారట. ఒక మంచి లవ్ స్టోరీకి పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తోడైతే రిజల్ట్ ఎలా ఉంటుందో అజయ్ భూపతి గత సినిమాలతో నిరూపించారు. అదే మ్యాజిక్ ఇక్కడ కూడా రిపీట్ అవుతుందని టీమ్ ధీమాగా ఉంది. జయకృష్ణ, రాషా జంట స్క్రీన్ మీద ఫ్రెష్ గా ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. హీరో, హీరోయిన్ల ఫస్ట్ లుక్ లతోనే సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. రాషా తడాని తన గ్లామర్ తో పాటు యాక్టింగ్ తో తెలుగు ఆడియన్స్ ను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.





# క్యాస్టింగ్ కౌచ్ ఉంది...

## మహిళలను వాడుకునేందుకే కొందరు సినిమాలు తీస్తారు: తమ్మారెడ్డి భరద్వాజ



టాలీవుడ్ లో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ‘మన శంకర వరప్రసాద్ గారు‘ సక్సెస్ మీట్ సందర్భంగా సినిమాలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారానికి ఆజ్యం పోశాయి. సినిమా ఇండస్ట్రీని అద్దంతో పోల్చిన ఆయన... ఇండస్ట్రీ చాలా బాగుందని... అవకాశాల కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి స్పందిస్తూ... ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెప్పారు. చిరంజీవి వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని అన్నారు. చిరంజీవి తొలిరోజుల్లో పరిస్థితులు ఎలా ఉండేవో తమకు తెలియదని... కానీ ఇప్పుడు పరిస్థితులు మొత్తం మారిపోయాయని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇదే అంశంపై నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా స్పందించారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో తొలి రోజుల నుంచే ఈ సమస్య ఉందని చెప్పారు. ఒకప్పుడు రాజ కుటుంబాల వారు, జమీందారులు మహిళల కోసమే సినిమాలు తీసేవారని అన్నారు. ప్రస్తుతం ఏడాదికి దాదాపు 250 సినిమాలు నిర్మితమవుతుంటే... వాటిలో 30 నుంచి 40 సినిమాలు మహిళలను వాడుకునే ధోరణితోనే నిర్మితమవుతున్నాయిని తమ్మారెడ్డి చెప్పారు. లైంగిక వాంఛలు తీర్చుకోవాలనే ధోరణి పరిశ్రమలోని ఒకరిద్దరు సినీ పెద్దల్లో ఉందని అన్నారు. క్యాస్టింగ్ కౌచ్ గురించి చిన్మయి చెప్పింది నిజమేనని చెప్పారు.



# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ

టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ’భగవంతుడు’. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.




# జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం ’ది రాజాసాబ్’. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷–లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613